7

సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

ఆదివారం । 14 । సెప్టెంబర్ । 2025



చీనీ టన్ను రూ.16,500
అనంతపురం మార్కెట్‌యార్డులో శనివారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.16,500, కనిష్టంగా రూ.8 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.17
కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్టంగా రూ.17, కనిష్టంగా రూ.8 ప్రకారం ధర పలికింది. మార్కెట్‌కు 3,150 టన్నుల టమాట వచ్చింది.

గరిష్టం/కనిష్టం
32.3°/ 20.7°
జిల్లాలో శనివారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 8 నుంచి 14 కి.మీ వేగంతో పశ్చిమ దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

జిల్లా కోర్టు భవనాలకు స్థల పరిశీలన



మామిళ్లకుంట క్రాస్‌లో స్థలాన్ని పరిశీలిస్తున్న హైకోర్టు జడ్జి రామకృష్ణ ప్రసాద్, జేసీ అభిషేక్

పుట్టపర్తి అర్బన్: జిల్లా కేంద్రం పుట్టపర్తిలో జిల్లా కోర్టు భవనాల నిర్మాణానికి అనువైన స్థలాన్ని హైకోర్టు జడ్జి రామకృష్ణ ప్రసాద్, జేసీ అభిషేక్‌కుమార్ పరిశీలించారు. జిల్లా కోర్టు భవనాల నిర్మాణాలకు కనీసం పది ఎకరాలు అవసరం కానుండగా, శనివారం హైకోర్టు జడ్జి, జేసీ అధికారులతో కలిసి పుట్టపర్తి సమీపంలోని మామిళ్లకుంట క్రాస్‌లో ఉన్న భూములను పరిశీలించారు. కొత్తచెరువు–పుట్టపర్తి ప్రధాన రహదారి సమీపంలోని పట్టుపరిశ్రమ శాఖ కార్యాలయం ఎదురుగా ఉన్న భూమిని పరిశీలించారు. అలాగే మరో ప్రాంతంలోని భూములను సైతం పరిశీలించారు. జిల్లా ప్రజలకు అనుకూలంగా అన్ని కోర్టులు ఒకే ప్రాంతంలో ఉండేవిధంగా సౌకర్యవంతంగా జిల్లా కోర్టు భవనాలు నిర్మించనున్నట్లు హైకోర్టు జడ్జి రామకృష్ణ ప్రసాద్ తెలిపారు. అధికారుల వెంట ఆర్డీఓ సువర్ణ, హిందూపురం సీనియర్ సివిల్ జడ్జి శైలజ, పుట్టపర్తి జూనియర్ సివిల్ జడ్జి సయ్యద్ ముజీబ్, తహసీల్దార్ కళ్యాణ్ తదితరులు ఉన్నారు.

సత్యసాయి సేవలో హైకోర్టు జడ్జి
ప్రశాంతి నిలయం: హైకోర్టు జడ్జి జస్టిస్ రామకృష్ణ ప్రసాద్ శనివారం సత్యసాయి సేవలో గడిపారు. శనివారం రోడ్డుమార్గాన పుట్టపర్తికి చేరుకున్న ఆయనకు ప్రశాంతి నిలయంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, హిందూపురం సీనియర్ సివిల్ జడ్జి శైలజ, పుట్టపర్తి జూనియర్ సివిల్ జడ్జి సయ్యద్ ముజీబ్‌లు ఘన స్వాగతం పలికారు. సాయంత్రం సాయికుల్వంత్ సభా మందిరంలో జడ్జి రామకృష్ణ ప్రసాద్ సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

టీడీపీ నేతకు దేహశుద్ధి

- మహిళను వేధించిన ఫలితం
- కారులోంచి లాక్కెళ్లి చితకబాదిన వైనం

గోరంట్ల: 'వెలుగు'లో పని చేస్తున్న ఓ మహిళను వేధింపులకు గురిచేసిన టీడీపీ నాయకుడు, మాజీ సర్పంచ్‌ను సదరు మహిళ బంధువులు దేహశుద్ధి చేశారు. రెండురోజుల క్రితం జరిగిన ఈ ఘటన శనివారం స్థానికంగా చర్చనీయాంశమైంది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని మల్లాపల్లి గ్రామానికి చెందిన ఓ మహిళ 'వెలుగు'లో పనిచేస్తోంది. సదరు మహిళపై కన్నేసిన ఓ టీడీపీ ముఖ్యనాయకుడు తరచూ ఆమెకు ఫోన్ చేసి వేధింపులకు గురిచేసేవాడు. రానురాను వేధింపులు తీవ్రతరం కావడంతో బాధిత మహిళ విషయం భర్తకు తెలిపింది. దీంతో సదరు నాయకుడికి బుద్ధి చెప్పాలనుకున్న మహిళ భర్త తన బంధువులు, మిత్రులతో కలిసి రెండురోజుల క్రితం రాత్రి వేళ పట్టణంలోని ఓ పెట్రోల్ బంకు వద్ద కాపు కాశాడు. ఆ సమయంలో కారులో అక్కడికి వచ్చిన టీడీపీ నాయకుడిని కారులోంచి లాక్కుని వెళ్లి చితకబాదారు. సదరు మహిళ భర్త కూడా టీడీపీ నాయకుడే కావడంతో ఆ పార్టీలోని కొందరు పెద్దలు విషయం బయటకు రాకుండా జాగ్రత్త పడ్డారు. కానీ శనివారం ఈ విషయం బయటకు రాగా..ఎవరా నాయకుడంటూ అందరూ ఆరా తీయడం ప్రారంభించారు. అయినా మహిళను వేధించిన ఆ నాయకుడిని చట్టప్రకారం కఠినంగా శిక్షించాలని పలువురు కోరుతున్నారు.


జాతీయ లోక్ అదాలత్‌లో 6,542 కేసుల పరిష్కారం



జిల్లా కోర్టులో కక్షిదారులకు భోజనం వడ్డిస్తున్న జిల్లా జడ్జి భీమారావు

అనంతపురం: 'కోర్టు కేసుల్లో ఎవరో ఒకరే గెలుస్తారు. మరొకరు పరాజితులు అవుతారు. కానీ జాతీయ లోక్ అదాలత్‌లో లభించే పరిష్కారంలో ఇరువురూ విజేతలే' అని ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఈ. భీమారావు అన్నారు. శనివారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టుల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఇందులో మొత్తం 6,542 కేసులు పరిష్కారమయ్యాయి. 32 మోటార్ వాహన ప్రమాద కేసుల్లో రూ.1.26 కోట్లు, సివిల్ దావాల్లో రూ.84 లక్షలు, 2,351 ప్రీ లిటిగేషన్ కేసుల్లో రూ.1.04 కోట్లు, ఎన్‌ఐ యాక్ట్ కేసుల్లో రూ. 1.18 కోట్లు బాధితులకు నష్ట పరిహారం అందించారు. జాతీయ లోక్ అదాలత్‌కు హాజరైన కక్షిదారులకు ఉచిత భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా కోర్టు జడ్జి సి.సత్యవాణి, అనంతపురం బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాన్ని ప్రశ్నిస్తే కేసులా?



ప్రజాస్వామ్య దేశంలో పత్రికా స్వేచ్ఛను హరించే విధంగా పాత్రికేయులపై కేసులు నమోదు చేయడం దారుణం. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారు. నిజాలను వెలికితీస్తున్న 'సాక్షి'పై కూటమి సర్కార్ అక్కసు వెళ్లగక్కుతోంది. పోలీసు వ్యవస్థలో లోటుపాట్ల గురించి రాస్తే పత్రికా యాజమాన్యంపై కేసులు నమోదు చేసి విచారణ పేరుతో వేధిస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోంది. 'సాక్షి'పై కేసు నమోదును తీవ్రంగా ఖండిస్తున్నాం. వాక్ స్వాతంత్ర్యాన్ని హరించే హక్కు ఎవరికీ లేదు.
–వై.విశ్వేశ్వరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, ఉరవకొండ



రాష్ట్రంలో నియంతృత్వ పాలన



ప్రజాస్వామ్యానికి పత్రికలే పట్టుగొమ్మలు. అలాంటి పత్రికలపై కక్షగట్టి అక్రమ కేసులు బనాయించడం దుర్మార్గం. ఒక నాయకుడు ప్రెస్ మీట్ కవర్ చేసిన పత్రికపై కేసులు పెట్టడం దేశంలో ఎక్కడా చూడలేదు. కూటమి సర్కార్ నియంతృత్వ పాలనకు ఇది నిదర్శనం. 'సాక్షి' ఎడిటర్, తదితరులపై కేసులు పెట్టడం ద్వారా ప్రజాస్వామ్యం, పత్రికా స్వేచ్ఛను కూటమి ప్రభుత్వం హరిస్తోంది. ప్రజాస్వామ్యవాదులంతా సర్కారు చర్యలను ఖండించాలి.
–దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, పుట్టపర్తి

గత టీడీపీ ప్రభుత్వంలో పీపీపీ పద్ధతిలో మెడాల్ ప్రాజెక్టు అనంతపురంలోనే పురుడు పోసుకుంది. 2014–19 మధ్య కాలంలో రక్తపరీక్షల పేరుతో భారీగా దోపిడీ సాగించింది. రక్త పరీక్షలు చేయకుండానే చేసినట్టు చూపి ప్రభుత్వ ఖజానాకు గండికొట్టింది. ఇప్పుడు మళ్లీ అనంతపురం సభలో మెడికల్ కాలేజీలను పీపీపీ పద్ధతిలో నిర్వహిస్తామంటూ సీఎం చంద్రబాబు స్పష్టత ఇవ్వడంతో 'మెడాల్' దోపిడీని అందరూ గుర్తు చేసుకుంటున్నారు. మళ్లీ జిల్లా నుంచే దోపిడీకి ఆజ్యం పోస్తూ చేసిన ప్రకటనపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 'పీపీపీ'కి ఫుల్‌స్టాప్ పెట్టి ప్రభుత్వ ఆస్పత్రుల్లోని ల్యాబులను ఉన్నతీకరించి పేదలకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకుంటే.. చంద్రబాబు మళ్లీ ఇప్పుడు ఆరోగ్య రంగాన్ని అగాథంలోకి నెట్టేలా నిర్ణయాలు తీసుకుంటుండడంపై ప్రజలు మండిపడుతున్నారు.



అనంత నుంచే.. దోపిడీకి రాచబాట

- గత టీడీపీ ప్రభుత్వంలో 'పీపీపీ' మాటున రూ. కోట్లు కొల్లగొట్టిన మెడాల్
- అప్పట్లో అనంతపురంలోనే పురుడు పోసుకున్న ప్రాజెక్టు
- రక్తపరీక్షలు చేయకుండానే చేసినట్టు చూపి ఖజానాకు కన్నం
- ఇప్పుడు మెడికల్ కాలేజీలు పీపీపీలోకి అంటూ 'అనంత'లోనే బాబు స్పష్టత
- దోపిడీకి మళ్లీ జిల్లా నుంచే రాచబాట వేశారంటూ సర్వత్రా విమర్శలు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: పీపీపీ.. క్లుప్తంగా పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్. ఈ పేరు టీడీపీకి బాగా అలవాటైన పదం. గతంలో పీపీపీ పేరున 'నీకింత నాకింత' అన్న చందాన దోచుకున్న తీరు జిల్లావాసులకే కాదు రాష్ట్ర ప్రజలందరికీ గుర్తుండే ఉంటుంది. అసలు ఈ పీపీపీ పద్ధతి పురుడు పోసుకున్నదే అనంతపురం జిల్లాలో కావడం గమనార్హం. అనంతపురం కరువు జిల్లా అని, తనకు ప్రాణమని చెప్పే చంద్రబాబు ఇక్కడి నుంచే దోపిడీ మొదలుపెట్టారనే విమర్శలు ఉన్నాయి.

మూడు నెలల్లోనే రాష్ట్రమంతటా..
2014లో రాష్ట్రం విడిపోయింది. ఆ ఏడాది జరిగిన ఎన్నికల్లో చంద్రబాబు అధికారం చేపట్టారు. వెంటనే రాష్ట్రవ్యాప్తంగా రక్తపరీక్షల నిర్వహణ ప్రైవేటుకు అప్పజెబుతూ నిర్ణయించారు. దీనికి బీజం అనంతలోనే వేశారు. పైలెట్ ప్రాజెక్టు కింద ఇక్కడ 6 మాసాలు నిర్వహించి ఆ తర్వాత అన్ని జిల్లాలకు విస్తరించాలనేది యోచన. అయితే, మూడు నెలలు కూడా అమలు కాకనే రాష్ట్ర వ్యాప్తంగా అమలుకు ఆదేశాలిచ్చారు.

రూ.300 కోట్ల దోపిడీ..
2019 నాటికి అంటే ఆరేళ్ల క్రితమే పీపీపీ పద్ధతి ద్వారా అనంతపురం జిల్లాలో బీజం పడిన ఈ ప్రాజెక్టు ద్వారా సదరు ప్రైవేటు సంస్థ రూ.300 కోట్ల అవినీతికి పాల్పడినట్టు అప్పట్లో ఆరోపణలు వెల్లువెత్తాయి. జిల్లాలోని పలు పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలలో రక్తపరీక్షలు చేయకపోయినా చేసినట్టు డాష్‌బోర్డులో చూపి కోట్లాది రూపాయల ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేశారు. 2019 తర్వాత కొత్త సర్కారు వచ్చాక పీపీపీ పద్ధతిని రద్దు చేసి అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో సొంతంగా రక్త పరీక్షల నిర్వహణకు లేబొరేటరీలు పునరుద్ధరించింది.

ఇప్పుడు మళ్లీ..
'సూపర్‌సిక్స్–సూపర్‌హిట్' అంటూ అమలు కాని పథకాలనూ అమలు చేసినట్లు డప్పు కొట్టుకున్న 'అనంత' వేదిక నుంచే మెడికల్ కాలేజీలను పీపీపీ పద్ధతిలో నిర్వహించనున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించడం గమనార్హం. ఇప్పటికే పెనుకొండలో నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాల పనులు కూటమి సర్కారు వచ్చాక నిలిచిపోయాయి. 50 ఎకరాల్లో రూ.375 కోట్లతో కళాశాలను నిర్మించాలని గత వైఎస్సార్ సీపీ సర్కారు యోచించింది. అప్పట్లోనే రూ.30 కోట్లు ఖర్చు చేసింది. కానీ చంద్రబాబు తాజాగా 'పీపీపీ' అనడంతో పెనుకొండ మెడికల్ కాలేజీకి గ్రహణం పట్టినట్టయింది. స్వయానా ఈ నియోజకవర్గం నుంచి మంత్రిగా ఉన్న సవిత కళాశాలను కాపాడుకోవాల్సి పోయింది మౌనంగా ఉండటం మరిన్ని విమర్శలకు తావిస్తోంది.

ప్రైవేటు వ్యక్తులైతే జవాబుదారీగా ఉంటారట..!
మెడికల్ కాలేజీలన్నీ ప్రైవేటుకు అప్పజెబుతున్నాం. పీపీపీ పద్ధతిలో ఇవ్వాలని నిర్ణయించాం. ప్రైవేటు వ్యక్తులైతే నిర్వహణ పరంగా జవాబుదారీగా ఉంటారు. ప్రభుత్వానికి 50 శాతం సీట్లు వస్తాయి. మీకు ఏం తెలుసని మాట్లాడుతున్నారు.
– ఈనెల 10న అనంతపురంలో జరిగిన సభలో సీఎం చంద్రబాబు వ్యాఖ్యలివీ

రెచ్చిపోయిన 'పచ్చ' నేతలు

- భార్యాభర్తపై కర్రలతో విచక్షణారహితంగా దాడి



ఎర్రమ్మ తలకు కుట్లు వేస్తున్న దృశ్యం

సాక్షి టాస్క్‌ఫోర్స్: 'పచ్చ' నేతలు రెచ్చిపోయారు. భార్యాభర్తపై విచక్షణారహితంగా దాడికి దిగారు. ఆత్మకూరు మండలం తలుపూరు గ్రామంలో శనివారం సాయంత్రం ఈ ఘటన చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన మేరకు.. తలుపూరు గ్రామానికి చెందిన గోసల కొండా, గోసల ఎర్రమ్మ భార్యాభర్తలు. వీరు శనివారం గ్రామ సమీపంలోని తమ పొలంలో వ్యవసాయ పనులు చేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే అదే గ్రామానికి చెందిన కొంతమంది టీడీపీ నేతలు అక్కడికి వెళ్లారు. ఈ భూమిలో వ్యవసాయం ఎలా చేస్తారు అంటూ దౌర్జన్యానికి దిగారు. సర్వే నంబర్ 68కు సంబంధించి భూమి సమస్య పెండింగ్‌లో ఉందని, తాము వ్యవసాయం చేస్తున్నది సర్వే నంబర్ 69లో అని గోసల కొండ చెబుతున్నా వినలేదు. భార్యాభర్తపై కర్రలతో విచక్షణారహితంగా దాడి చేశారు. గోసల యర్రమ్మ తలకు తీవ్ర గాయాలు కాగా, కొండా కాలికి గాయమైంది. వెంటనే వారిని స్థానికులు అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. యర్రమ్మ తలకు వైద్యులు కుట్లు వేశారు. కొండా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఎమ్మెల్యే పరిటాల సునీత, టీడీపీ నేతల ప్రోద్బలంతోనే తమపై దాడి చేశారని బాధితులు వాపోయారు. ఎర్రమ్మ ఫిర్యాదు మేరకు దాడి చేసిన వారిపై కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్‌ఐ లక్ష్మణరావు తెలిపారు.

జిల్లా సమగ్రాభివృద్ధే లక్ష్యం

- అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ముందుకు సాగుతాం
- అర్హులకు పథకాలు అందిస్తాం... పౌరసేవలు వేగవంతం చేస్తాం
- జిల్లా నూతన కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్



కలెక్టరేట్‌లో బాధ్యతలు స్వీకరిస్తున్న నూతన కలెక్టర్ ఏ.శ్యాం ప్రసాద్



సత్యసాయి మహాసమాధిని దర్శించుకుంటున్న నూతన కలెక్టర్ ఏ.శ్యాం ప్రసాద్

ప్రశాంతి నిలయం: '' జిల్లా సమగ్రాభివృద్ధే నా లక్ష్యం. ఇందుకోసం ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి ముందుకు సాగుతాం. ప్రభుత్వ సేవలను పారదర్శకంగా అందేలా చేస్తాం. సంక్షేమంతో పాటు అభివృద్ధికీ ప్రాధాన్యం ఇస్తూ అన్ని రంగాల్లో జిల్లాను అగ్రస్థానంలో నిలుపుతా'' అని జిల్లా నూతన కలెక్టర్ ఏ.శ్యాం ప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు ప్రభుత్వ అధికారులు, సిబ్బంది కలెక్టర్‌ను పరిచయం చేసుకుని శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నూతన కలెక్టర్ ఏ.శ్యాం ప్రసాద్ పాత్రికేయులతో మాట్లాడారు. తాను పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చానని తెలిపారు. తన కుమార్తె విద్యాభ్యాసం సత్యసాయి విద్యాసంస్థల్లో సాగిందని, అందువల్ల జిల్లాపై తనకు సమగ్ర అవగాహన ఉందన్నారు. వ్యవసాయంతో పాటు పారిశ్రామిక రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తూ జిల్లాను ప్రగతి పథంలో నడిపిస్తామన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతా రంగాల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తానన్నారు. పరిశుభ్రత, నీటి సరఫరా, విద్యుత్, జల సంరక్షణ, ఆరోగ్యం, విద్య తదితర ప్రధానమైన అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు.

వైభవంగా బాబా శత జయంత్యుత్సవాలు
సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని నూతన కలెక్టర్ ఏ.శ్యాం ప్రసాద్ తెలిపారు. ఇందుకోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తామన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ రామసుబ్బయ్య, ఆర్డీఓలు సువర్ణ, మహేష్, వీవీఎస్ శర్మ, ఆనంద్‌కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. అంతకుముందు ఆయన ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. బెంగళూరు నుంచి రోడ్డు మార్గంలో పుట్టపర్తికి చేరుకున్న కలెక్టర్ శ్యాంప్రసాద్‌కు సాయికుల్వంత్ సభా మందిరంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ ఎం.రామసుబ్బయ్య, ఆర్డీఓలు సువర్ణ, మహేష్, శర్మ, ఆనంద్‌కుమార్ ఘన స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ సాయికుల్వంత్ సభా మందిరానికి వెళ్లి సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

జిల్లా నూతన ఎస్పీగా సతీష్‌కుమార్

- వి.రత్నకు పోస్టింగ్ ఇవ్వని ప్రభుత్వం



సతీష్ కుమార్

పుట్టపర్తి టౌన్: జిల్లా నూతన ఎస్పీగా సతీష్‌కుమార్ నియమితులయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా పలువురు ఎస్పీలను బదిలీ చేసిన ప్రభుత్వం... గుంటూరు (అర్బన్) ఎస్పీగా పనిచేస్తున్న సతీష్ కుమార్‌ను జిల్లాకు బదిలీ చేసింది. ఇక్కడ ఎస్పీగా ఉన్న వి.రత్నకు మాత్రం పోస్టింగ్ ఇవ్వలేదు. ఈ మేరకు శనివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు.

వ్యవసాయ కుటుంబంలో పుట్టి..
జిల్లా నూతన ఎస్పీగా నియమితులైన సతీష్‌కుమార్ స్వస్థలం తమిళనాడు. ఆయన 2016 ఐపీఎస్ బ్యాచ్. వ్యవసాయ కుటుంబంలో పుట్టిన ఆయన.. బీటెక్ బయోటెక్నాలజీ చదివారు. అనంతరం తమిళనాడు గ్రూప్–2 పోస్టు సాధించి ట్రెజరీ డిపార్టుమెంట్‌లో రెండున్నర ఏళ్లు పనిచేశారు. ఆ తర్వాత యూపీఎస్సీపై గురిపెట్టారు. నాలుగుసార్లు విఫలమైనా పట్టుదలతో చదివారు. ఐదో ప్రయత్నంలో ఐపీఎస్‌గా ఎంపికయ్యారు. శిక్షణ అనంతరం చింతలపల్లి అదనపు ఎస్పీగా, నర్సీపట్నంలో ఓఎస్డీగా, అల్లూరి సీతారామరాజు, గుంటూరు జిల్లాల ఎస్పీగా పనిచేశారు. సతీష్ కుమార్ ఎక్కడ పనిచేసినా యువతకు ఉపాధి కల్పించే కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇచ్చేవారు. తరచూ కళాశాలలకు వెళ్లి విద్యార్థులకు సైబర్ నేరాల గురించి తెలియజెప్పేవారు. అర్ధరాత్రి సమయాల్లో పట్టణంలో పర్యటిస్తూ ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకునే వారు. శాంతి భద్రతల సమస్య తలెత్తితే వెంటనే పరిష్కరించేవారు. స్నేహపూర్వక పోలీసింగ్, కమ్యూనిటీ పోలీసింగ్‌లో మంచిపేరు సంపాదించారు. గుంటూరు ఎస్పీగా నేరాలు నియంత్రించడంలో వ్యూహాత్మకంగా పనిచేశారు. అందుకే సతీష్‌కుమార్‌కు అటు పోలీసులు, ఇటు ప్రజల నుంచి ప్రశంసలు దక్కాయి. ఆదివారమే ఆయన జిల్లా ఎస్పీగా బాధ్యతలు తీసుకోనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

బార్.. టెం'డర్'

- గడువు సమీపిస్తున్నా బార్లకు దరఖాస్తులు నిల్
- అప్లికేషన్లు వేయనీయకుండా అడ్డగింత
- కూటమి నేతలు సిండికేటుగా మారి బెదిరింపులు
- 12 బార్లలో 7 దుకాణాలకు ఫుల్.. ఐదింటికి మళ్లీ నోటిఫికేషన్
- అయినా స్పందన లేక ఎక్సైజ్ అధికారుల తిప్పలు
- మరో మూడు రోజులు గడువు పొడిగించిన వైనం

సాక్షి, పుట్టపర్తి

నూతన మద్యం పాలసీతో ఆదాయం పెంచుకోవాలనే ప్రభుత్వ ఆలోచనకు అధికార కూటమి పార్టీల నాయకులు తూట్లు పొడుస్తున్నారు. మద్యం దుకాణాలన్నీ తమ ఆధ్వర్యంలోనే నడిపిస్తూ సొమ్ము చేసుకుంటున్న నేతలు... తాజాగా బార్లపై కన్నేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో మద్యం బార్ల ఏర్పాటుకు ప్రభుత్వం టెండర్లు పిలవగా.. కూటమి పార్టీల నాయకులే సిండికేటుగా మారి ఎవరినీ దరఖాస్తు చేయనీయకుండా బెదిరింపులకు దిగారు. ఈ నేపథ్యంలోనే ఇటీవల జిల్లాలో 12 బార్లకు టెండర్లు పిలవగా.. ఏడింటికి మాత్రమే దరఖాస్తులు వచ్చాయి. వాటిని లాటరీ పద్ధతిన కేటాయించారు. మిగిలిన ఐదు బార్లకు మరోమారు నోటిఫికేషన్ జారీ చేశారు. వాస్తవానికి ఆదివారంతో (ఈనెల 14) దరఖాస్తుకు గడువు ముగుస్తుంది. అయినా దరఖాస్తులు రాలేదు. దీంతో ఎక్సైజ్ అధికారులు రాష్ట్ర వ్యాప్తంగా దరఖాస్తుల గడువు ఈనెల 17వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు పొడిగించారు. అయితే ఇప్పటివరకు ఒక్క బార్‌కు కూడా దరఖాస్తులు రాలేదు. మరో మూడు రోజులు కాదు.. మూడు నెలలు పొడిగించినా.. దరఖాస్తులు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. కనీసం నాలుగు దరఖాస్తులు వస్తే కానీ, బార్ కేటాయింపునకు లాటరీ తీయరాదనే నిబంధన ఉండటంతో ఎక్సైజ్ అధికారులకు ఒత్తిళ్లు తప్పడం లేదు.



వ్యాపారం తగ్గుతుందని...
జిల్లాలోని మద్యం అమ్మకాలన్నీ కూటమి నాయకుల కనుసన్నల్లోనే నడుస్తున్నాయి. ఇటీవల ప్రభుత్వం కేటాయించిన 7 బార్లనూ వారే నడుస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో ఉన్న బార్‌ల వ్యాపారం తగ్గుతుందని కొత్త బార్‌లకు అవకాశం ఇవ్వకుండా బెదిరింపులకు దిగినట్లు తెలుస్తోంది. అందువల్లే దరఖాస్తులు చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదని అధికారులే చెబుతున్నారు.

అందని దరఖాస్తులు.. అధికారులపై ఒత్తిడి..
జిల్లాలో మడకశిర, ధర్మవరం–1, ధర్మవరం–2, కదిరి, హిందూపురం ప్రాంతాల్లో మద్యం బార్ల ఏర్పాటుకు ఎక్సైజ్ అధికారులు నోటిఫికేషన్ జారీ చేశారు. ఈనెల 14వ తేదీ వరకు దరఖాస్తుకు గడువు విధించారు. తగినన్ని దరఖాస్తులు అందని పరిస్థితుల్లో ఈనెల 17వ తేదీ వరకు గడువు పొడిగించారు. అయితే ఇప్పటి వరకు కనీసం ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. ఇన్ని రోజులుగా రాని దరఖాస్తులు ఒకట్రెండు రోజుల్లో వచ్చే అవకాశం కూడా లేదు. ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో కూటమి నేతలు సిండికేటుగా మారి ఎవరినీ దరఖాస్తు చేయనీయకుండా అడ్డుకుంటున్నట్లు తెలిసింది. మరోవైపు దరఖాస్తులు వచ్చేలా చూడాలని ఎక్సైజ్ అధికారులపై తీవ్ర ఒత్తిడి ఉంది.

మొన్న కూడా 4 చొప్పునే..
బార్ల టెండర్లలో ప్రభుత్వం నూతన నిబంధనలు విధించింది. కనీసం నాలుగు దరఖాస్తులు అందితేనే లాటరీ తీయాలని ఆదేశించింది. దీంతో గత నెలలో జిల్లాలోని 12 బార్లకు నోటిఫికేషన్ ఇవ్వగా, అందులో ఆరు బార్లకు కేవలం నాలుగు చొప్పున మాత్రమే దరఖాస్తులు వచ్చాయి. నిబంధన మేరకు నాలుగు దరఖాస్తులు వేయాలి కాబట్టి కూటమి నేతలే వేసినట్లు సమాచారం. మిగతా వారు దరఖాస్తు చేయనీయకుండా బెదిరింపులతో అడ్డుకున్నట్లు తెలుస్తోంది. కల్లుగీత కార్మికులకు రిజర్వ్ చేసిన బార్‌కు మాత్రం 11 మంది పోటీ పడటం గమనార్హం.

ఒక్క దరఖాస్తూ కష్టమే..
హిందూపురంలో ఇప్పటికే మూడు బార్లు ఉన్నాయి. దీంతో మరో బార్‌కు దరఖాస్తులు రాకుండా మిగిలిన బార్ ఓనర్లు ఒప్పందం చేసుకున్నారు. దీంతో అక్కడ ఒక్క దరఖాస్తు కూడా కష్టమే. కదిరిలో ఇప్పటికే రెండు బార్లు నడుస్తున్నాయి. దీంతో మరో బార్ వద్దనే నిర్ణయానికి వచ్చారు. మడకశిరలో ఒక బార్ ఏర్పాటుకు నోటిఫికేషన్ వచ్చినప్పటికీ... కర్ణాటక సరిహద్దు కావడం... ఈ ప్రాంత వాసులు కర్ణాటక మద్యానికి మొగ్గు చూపడంతో వ్యాపారం జరగని ఎవరూ ముందుకు రావడం లేదు. ఇక ధర్మవరంలో ఇప్పటికే ఒక బార్ నడుస్తోంది. మరో రెండు బార్లకు నోటిఫికేషన్ ఇచ్చినప్పటికీ దరఖాస్తులు అందలేదు.

దరఖాస్తులు వస్తేనే లాటరీ
ఒక్కో బార్‌కు కనీసం నాలుగు దరఖాస్తులు వస్తేనే లాటరీ ప్రక్రియ ద్వారా ఎంపిక చేస్తాం. ఈ మేరకు ప్రభుత్వం నుంచి నిబంధనలు ఉన్నాయి. ఒకట్రెండు దరఖాస్తులు వస్తే.. ఫీజు వెనక్కి చెల్లించి లాటరీ ప్రక్రియ రద్దు చేస్తాం. మరోసారి నోటిఫికేషన్ ఇస్తాం. దరఖాస్తులు వేయనీయకుండా నాయకుల బెదిరింపుల అంశం నా దృష్టికి రాలేదు.
– గోవిందనాయక్, ఎక్సైజ్ సూపరింటెండెంట్, పుట్టపర్తి

యువతకు నయవంచన

- భృతి లేదు.. ఉద్యోగమూ లేదు
- 15 నెలలైనా అమలుకు నోచని హామీ
- నోరు మెదపని కూటమి పాలకులు



పుట్టపర్తి: అధికారంలోకి వస్తే యువతకు 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని, ఉద్యోగం వచ్చే వరకూ నెలకు రూ.3వేల భృతి చెల్లిస్తామని ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నెరవేర్చలేక పోయింది. చంద్రబాబు సారథ్యంలో ప్రభుత్వం కొలువుదీరి 15 నెలలైనా దాని ఊసే ఎత్తడం లేదు. ఉద్యోగాల కోసం నిరుద్యోగులకు ఎదురు చూపులు తప్పడం లేదు.

నిరుద్యోగులతో ఆటలా..?

ఇంటికో ఉద్యోగం.. అంతవరకూ నిరుద్యోగ భృతి అంటూ ఎన్నికల సమయంలో కూటమి పార్టీల నాయకులు ఊరూరా ప్రచారం చేశారు. నమ్మి అధికారం కట్టబెట్టిన యువతకు మాత్రం పాలకులు హామీ అమలు చేయకుండా వంచించారు. జిల్లాలో ఇంటర్ సమానమైన వృత్తి విద్య, డిగ్రీ, పీజీ, బీటెక్ తదితర కోర్సులు పూర్తి చేసిన యువతీ యువకులు దాదాపు మూడు లక్షల మంది ఉన్నారు. ప్రభుత్వం ఉద్యోగాల భర్తీపై దృష్టి సారించలేదు. జిల్లాలో భూమి, నీటి వనరులు ఉన్నప్పటికీ ఒక్క కొత్త పరిశ్రమనూ స్థాపించలేదు. ప్రభుత్వం నుంచి తీపి కబురు వస్తుందేమోనని ఎదురుచూస్తున్న యువతకు నిరాశే ఎదురవుతోంది. ఉద్యోగాల భర్తీ గురించి కానీ.. నిరుద్యోగ భృతి చెల్లింపు గురించి కానీ మాట్లాడటం లేదు.

గత ప్రభుత్వంలో ఎంతో మందికి ఉపాధి..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తొలి రెండేళ్లలోనే ఐదు లక్షల ఉద్యోగాలు భర్తీ చేసి, యువతకు అండగా నిలిచింది. జాబ్‌క్యాలెండర్ విడుదల చేసి మరీ ఉపాధి కల్పించింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని తూచ తప్పకుండా అమలు చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఉపాధి కల్పన దిశగా ఎటువంటి చర్యలూ చేపట్టలేదు. కనీసం యువతకు నిరుద్యోగ భృతి కూడా చెల్లించలేదు. అధికారంలోకి రావడం కోసం హామీలు ఇచ్చి.. తర్వాత విస్మరించడంపై చంద్రబాబు సర్కారుపై యువత అసంతృప్తితో ఉంది.

జిల్లాలో చదువుకున్న యువత వివరాలు	
పీజీ, ఎంటెక్ చేసిన వారు	36,090
డిగ్రీ, బీటెక్, బీఈడీ కోర్సులు చేసిన వారు	93,000
టీటీసీ సమానమైన కోర్సులు చేసిన వారు	18,009
వృత్తి విద్య, ఐటీఐ కోర్సులు చేసిన వారు	33,012
ఇతర విద్యా వంతులు	1,13,000

రూ.3వేల భృతి ఇవ్వాలి..



ఇంటికో ఉద్యోగం లేకపోతే ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన ప్రతి నిరుద్యోగికీ నెలకు రూ.3 వేల భృతి అందిస్తామని కూటమి పార్టీల నాయకులు ఎన్నికల్లో హామీ ఇచ్చారు. కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చి ఏడాది కాలం దాటినా ఉద్యోగాలు ఇవ్వలేదు. మరి భృతి అయినా ఇవ్వాలి కదా..? ఇంత వరకు ఆ హామీ అమలు గురించే పట్టించుకోకపోవడం దారుణం.

– పురుషోత్తం, జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్ విద్యార్థి విభాగం

యువతను మోసగించారు



కూటమి ప్రభుత్వం ఉద్యోగం కల్పిస్తుందని, వచ్చేంత వరకు నిరుద్యోగ భృతి ఇస్తుందని యువత ఆశతో ఎదురుచూస్తోంది. సంవత్సరం దాటిపోయినా ఆ ఊసే లేక పోవడం చూస్తుంటే సర్కారు నమ్మించి మోసం చేసినట్లు అర్థమవుతోంది. ఏదైనా హామీ ఇస్తే నెరవేర్చాలి. అంతే కానీ ఇలా నమ్మించి వంచించడం తగదు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించి తగు చర్యలు తీసుకోవాలి.

– బదా నాగార్జున్‌రెడ్డి, చంద్రాయునిపల్లి, నల్లమాడ మండలం

క్లుప్తంగా

ఉద్యోగులు డ్రెస్ కోడ్ పాటించాలి



ఎనుములపల్లిలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ ఫైరోజాబేగం

పుట్టపర్తి అర్బన్: వైద్య ఆరోగ్య శాఖలో పని చేసే ఉద్యోగులు డ్రెస్ కోడ్ తప్పనిసరిగా పాటించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఫైరోజా బేగం ఆదేశించారు. శనివారం పుట్టపర్తి మండలం ఎనుములపల్లి, కర్ణాటక నాగేపల్లి, పుట్టపర్తి ఆరోగ్య కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ వైద్యం కోసం ఆస్పత్రులకు వచ్చే ప్రజలు ఈహెచ్ఆర్ నమోదు కోసం ప్రతి ఒక్కరూ ఆధార్ కార్డులను తప్పనిసరిగా వెంట తీసుకు రావాలన్నారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై ఆరాతీశారు. ప్రజలకు ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఐడీలు క్రియేట్ చేయాలని ఆదేశించారు. కర్ణాటక నాగేపల్లిలో వ్యాధి నిరోధక టీకా కేంద్రాన్ని సందర్శించి పిల్లలకు ఇచ్చే టీకాలను పరిశీలించారు. రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఏఎన్‌ఎంను ఆదేశించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ మునిచంద్రిక, సీహెచ్‌ఓ వన్నప్ప, సిబ్బంది పాల్గొన్నారు.

భాస్కర్‌రెడ్డి మృతి తీరని లోటు

మడకశిర: వైఎస్సార్‌సీపీ నేత తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి మృతి ఉమ్మడి అనంతపురం జిల్లాకు తీరని లోటని మాజీ మంత్రి, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు ఎన్.రఘువీరారెడ్డి పేర్కొన్నారు. మడకశిర మాజీ ఎమ్మెల్యే సుధాకర్ తదితరులతో కలిసి రఘువీరారెడ్డి శనివారం అనంతపురంలో తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి మృత దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. భాస్కర్‌రెడ్డి సతీమణి, జిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ తోపుదుర్తి కవితను ఓదార్చారు.

ఇసుక టిప్పర్లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ఇసుక టిప్పరు

ముదిగుబ్బ: ఉప్పలపాడు సమీపంలోని చిత్రావతి నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు టిప్పర్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శివరాముడు శనివారం తెలిపారు. సీజ్ చేసిన టిప్పర్లను మైన్స్ అండ్ జియాలజీ అధికారులకు అప్పగించిచినట్లు పేర్కొన్నారు.

హోరాహోరీగా బాల్ బ్యాడ్మింటన్ పోటీలు



వెస్ట్ గోదావరి-ప్రకాశం జట్ల మధ్య పోటీని ప్రారంభిస్తున్న ఎంఈఓ సుధాకర్‌నాయక్

బత్తలపల్లి: రామాపురం జెడ్పీహెచ్ఎస్ మైదానంలో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి జూనియర్ బాల బాలికల 10వ బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భాగంగా రెండో రోజు శనివారం పోటీలు హోరాహోరీగా కొనసాగాయి. బాలుర విభాగంలో విశాఖపట్నం – తూర్పుగోదావరి జట్ల మధ్య జరిగిన పోటీలో తూర్పుగోదావరి, ప్రకాశం – విశాఖపట్నం మధ్య జరిగిన పోటీలో ప్రకాశం జట్టు విజయం సాధించాయి. బాలికల విభాగంలో గుంటూరు–విశాఖపట్నం మధ్య జరిగిన పోటీలో గుంటూరు, శ్రీకాకుళం–తూర్పుగోదావరి జట్ల మధ్య జరిగిన పోటీలో శ్రీకాకుళం జట్టు విజయం సాధించాయి. బాలుర విభాగంలో ప్రకాశం, తూర్పుగోదావరి, శ్రీకాకుళం, చిత్తూరు జిల్లాలు సెమీఫైనల్‌కు చేరాయి. బాలికల విభాగంలో శ్రీకాకుళం, గుంటూరు, తూర్పుగోదావరి, విశాఖపట్నం జిల్లాలు సెమీఫైనల్‌కు చేరాయి. కాగా.. శనివారం నాటి పోటీలను హెచ్ఎం వెంకటనాయుడుతో కలిసి ఎంఈఓ సుధాకర్‌నాయక్ ప్రారంభించారు. కార్యక్రమంలో బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విజయశంకర్‌రెడ్డి, చైర్మన్ వెంకట్రావు, జనరల్ సెక్రటరీ బాలాజీ, జిల్లా అధ్యక్షుడు ఈశ్వరయ్య, జనరల్ సెక్రటరీ వెంకటేష్, పీడీ తలారి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి యూటీఎఫ్ 'రణభేరి'

ధర్మవరం అర్బన్: ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంపై యూటీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం నుంచి 'రణభేరి' ప్రారంభమవుతోందని రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన ఆర్థిక, ఆర్థికేతర విద్యారంగ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలనే డిమాండ్లతో రాష్ట్ర వ్యాప్తంగా ఐదు ప్రాంతాల్లో ఈ నెల 15 నుంచి 19 వరకు 'రణభేరి' నిర్వహించనున్నట్లు వెల్లడించారు. 15న పశ్చిమ రాయలసీమ ప్రాంతంలోని కర్నూలులో ప్రారంభమవుతుందన్నారు. 16న అనంతపురం జిల్లా, 17న శ్రీసత్యసాయి జిల్లా, 18న అన్నమయ్య జిల్లా, 19న కడప, నంద్యాల జిల్లాల్లో 'రణభేరి' యాత్ర కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి రామకృష్ణనాయక్, నాయకులు లక్ష్మయ్య, జింకా హరికృష్ణ, నాగిరెడ్డి, హెచ్.రామాంజనేయులు, సాయి గణేష్, ఆంజనేయులు, అమర్ నారాయణ రెడ్డి, రాంప్రసాద్, బిల్లే రామంజినేయులు, వెంకట కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

నవంబర్ 7 నుంచి రెవెన్యూ క్రీడలు

- హాజరు కానున్న 2 వేల మంది ఉద్యోగులు
- రెవెన్యూ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు



రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడల షెడ్యూల్‌ను విడుదల చేస్తున్న నాయకులు

అనంతపురం అర్బన్: అనంతపుం వేదికగా రాష్ట్ర స్థాయి రెవెన్యూ క్రీడలు, సాంస్కృతిక ఉత్సవాలు నంబరు 7 నుంచి మూడు రోజులపాటు పండుగ వాతావరణంలో నిర్వహించనున్నట్లు రెవెన్యూ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు ప్రకటించారు. అనంతపురం విచ్చేసిన ఆయన శనివారం రెవెన్యూ హోమ్‌లో డీఆర్‌ఓ మలోల, రెవెన్యూ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌వీ రాజేష్, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల అధ్యక్షులు దివాకర్‌రావు, మైనుద్దీన్, మహిళా విభాగం అధ్యక్షురాలు సురేఖరావుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల కలెక్టర్ల సహకారంతో క్రీడలను ఉత్సాహంగా ఉల్లాసంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపడుతున్నామని చెప్పారు. పనిఒత్తిడిలో ఉండే రెవెన్యూ ఉద్యోగులకు ఈ క్రీడా ఉత్సవాలు మానసిక, శారీరక ఉల్లాసాన్ని ఇస్తాయన్నారు. తొలిరోజు 7న కార్యక్రమాన్ని సీసీఎల్ఏ ప్రారంభిస్తారన్నారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి హాజరవుతారని పేర్కొన్నారు. ఇక ముగింపు కార్యక్రమానికి ముఖ్యమంత్రి, రెవెన్యూ శాఖ మంత్రి, ఇతర ప్రజాప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. ఇప్పటికే అందరినీ కలిసి ఆహ్వానించామన్నారు. హోదా తారతమ్యం లేకుండా క్రీడలు, సాంస్కృతిక ఉత్సవాల్లో రెవెన్యూ ఉద్యోగులు వీఆర్‌ఏ మొదలు డిప్యూటీ కలెక్టర్ స్థాయి వరకు అందరూ పాల్గొంటారన్నారు. జిల్లా ఒక యూనిట్‌గా 26 జిల్లా యూనిట్లు, సీసీఎల్‌ఏ యూనిట్ మొత్తం 27 యూనిట్ల నుంచి దాదాపు 2 వేల మంది ఉద్యోగులు పాల్గొంటారని వెల్లడించారు. క్రీడా కార్యక్రమాల్లో ఐఏఎస్ అధికారులందరూ పాల్గొంటారన్నారు. రెవెన్యూ క్రీడలు నిర్వహించేందుకు సహకారం అందిస్తున్న ప్రభుత్వానికి, ఆర్డీటీ యాజమాన్యానికి రెవెన్యూ ఉద్యోగుల సంఘం తరపున ధన్యావాదాలు తెలియజేస్తున్నామన్నారు. అనంతరం రెవెన్యూ క్రీడలు, సాంస్కృతిక ఉత్సవాల షెడ్యూల్‌ను నాయకులు విడుదల చేశారు.

అనంతపురం క్రికెట్‌కు వన్నె తెచ్చిన అనూష



రాయలసీమ క్రికెట్ గ్రౌండ్‌ను ప్రారంభిస్తున్న మాంఛో ఫెర్రర్

అనంతపురం: భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించి అనంతపురం క్రికెట్ చరిత్రకు వన్నె తెచ్చిన గొప్ప క్రీడాకారిణి అనూష అని ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్ అన్నారు. అనంతపురం స్పోర్ట్స్ అకాడమీలో శనివారం రాయలసీమ క్రికెట్ మైదానాన్ని ఆయన అధికారికంగా ప్రారంభించారు. జిల్లాలో క్రికెట్ అభివృద్ధిని ప్రోత్సహించడానికి సీనియర్ క్రీడాకరులు చొరవ చూపించాలన్నారు. ఈ సందర్భంగా భారత జట్టు మహిళా క్రికెటర్ అనూషకు లక్ష రూపాయల చెక్కును జిల్లా క్రికెట్ సంఘం తరపున మాంఛోఫెర్రర్ అందజేశారు. అనంతరం సీనియర్ క్రికెటర్లు ఒక మ్యాచ్ ఆడారు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు ప్రకాష్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి వి.భీమలింగా రెడ్డి, వెటరన్స్ క్రికెట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మచ్చా రామలింగారెడ్డి, మాజీ అధ్యక్షుడు పి.మల్లికార్జున, మాజీ రంజీ క్రీడాకారలు కేఎస్ షాబుద్దీన్, ఎల్ఎన్ ప్రసాద్‌రెడ్డి, కేఏ ఫయాజ్ అహమ్మద్, డి.సురేష్, షేక్షావలి, డీబీ ప్రశాంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదం కేసులో ఆరు నెలల జైలు

పామిడి: రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతికి కారణమైన కేసులో ముద్దాయికి ఆరు నెలల జైలు శిక్ష పడింది. ఇందుకు సంబంధించిన వివరాలను సీఐ యుగంధర్ శనివారం మీడియాకు వెల్లడించారు. 2015 డిసెంబర్ 24న కోయలదిన్నె లలితమ్మ భర్త పామిడిలోని రోడ్డు ప్రనమాదంలో మృతి చెందారు. లలితమ్మ ఫిర్యాదుకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసుకు సంబంధించి గత శుక్రవారం విచారణ జరిగింది. ప్రాసిక్యూషన్ తరపున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సురేఖ వాదనలు వినిపించారు. రోడ్డు ప్రమాదానికి కారకుడు సయ్యద్ అబూబ్ అని తేలడంతో గుత్తి జేఎఫ్‌సీఎం జడ్జి అనిల్‌కుమార్ ఆరు నెలల జైలు శిక్షతో పాటు రూ.2వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.



శ్రీవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

ఖాద్రీశునికి ప్రత్యేక పూజలు

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉమ్మడి అనంతపురం, వైఎస్సార్ కడప, చిత్తూరు జిల్లాలతో పాటు కర్ణాటక నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

థియేటర్‌లో చోరీ

కొత్తచెరువు: మండల కేంద్రం కొత్తచెరువులోని పుట్టపర్తి రోడ్డులో గల సందీప్ థియేటర్‌లో శనివారం తెల్లవారుజామున రూ.ర51 వేల నగదు చోరీ జరిగినట్లు థియేటర్ మేనేజర్ పెద్దిరెడ్డిగారి నరసింహారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు రంగంలోకి దిగిన సీఐ మారుతీప్రసాద్ సీసీ టీవీ ఫుటేజీల ఆధారంగా నగదు చోరీ చేసినది లక్ష్మి థియేటర్ వాచ్‌మెన్ బి.ధనుష్‌గా గుర్తించి అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి నగదు రికవరీ చేసి, రాడ్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

మాజీ మంత్రి శైలజానాథ్‌కు అస్వస్థత



చికిత్స పొందుతున్న శైలజానాథ్

శింగనమల: మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సాకే శైలజానాథ్ అస్వస్థతకు గురయ్యారు. జ్వరంతో ఇబ్బంది పడుతున్నా ఈ నెల 9న అనంతపురం ఆర్డీఓ కార్యాలయం వద్ద నిర్వహించిన 'అన్నదాత పోరు'లో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం హైదరాబాద్‌లోని సొంతింటికి వెళ్లారు. ఉన్నట్టుండి శుక్రవారం అస్వస్థతకు గురయ్యారు. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే ఆయన్ను ఆపోలో ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. శైలజానాథ్ త్వరగా కోలుకోవాలని కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు, అభిమానులు కోరుకుంటున్నారు.

జంట హత్యల కేసులో మరొకరికి రిమాండ్

రాప్తాడు: గంగలకుంట గ్రామ పొలంలో జరిగిన జంట హత్య కేసులో పది మంది నిందితుల అరెస్ట్ తర్వాత తాజాగా శనివారం మరొక నిందితున్ని పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు ప్రత్యేక విచారణ అధికారి, అనంతపురం నాల్గో పట్టణ సీఐ జగదీష్ శనివారం వెల్లడించారు. ఈ ఏడాది మే 17న గంగలకుంట గ్రామ పొలంలో గొల్లపల్లికి చెందిన రైతు చిగిచెర్ల నారాయణరెడ్డి, ముత్యాలమ్మ దంపతులపై టీడీపీ కార్యకర్తలు వేట కొడవళ్లు, కట్టెలతో దాడి చేసి హతమార్చిన విషయం తెలిసిందే. ప్రత్యక్ష సాక్షి మృతుడు నారాయణరెడ్డి కుమారుడు చిగిచెర్ల ప్రదీప్‌కుమార్ రెడ్డి ఫిర్యాదు మేరకు రాప్తాడు పోలీసులు 11 మందిపై కేసు నమోదు చేశారు. మే 19న ఆరుగురు నిందితులను రిమాండ్‌కు పంపారు. అదే నెల 21న మరొక నిందితుడు కోర్టులో లొంగిపోయాడు. అదే నెల 23న ఇంకొక నిందితుడిని, ఈ నెల 12న మరో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అజ్ఞాతంలో ఉన్న చివరి నిందితుడు గొల్లపల్లి పెద్దింటి జగదీష్ శనివారం హంపాపురం సమీపంలోని 44వ జాతీయ రహదారిపై తచ్చాడుతూ కనిపించగా.. పోలీసులు అరెస్ట్ చేసి న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. హత్య జరిగి 120 రోజుల తర్వాత మొత్తం 11 మంది నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రస్తుతం ఈ కేసులోని 8 మంది నిందితులు 3 నెలల తర్వాత బెయిల్‌పై బయటకు వచ్చారు.

లాటరీ, సారా విక్రేతల అరెస్ట్

కదిరి టౌన్: లాటరీలు, సారాయి విక్రయిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారని డీఎస్పీకి అందిన సమాచారం మేరకు.. పట్టణ ఎస్ఐ బాబ్జాన్ ఆధ్వర్యంలో పోలీసులు శనివారం సాయంత్రం కుటాగుళ్ల రైల్వే గేటు సమీపంలో దాడులు నిర్వహించారు. ఐదుగురిని అరెస్ట్ చేసి.. వారి నుంచి 16 లీటర్ల నాటుసారా, 47 లాటరీ టికెట్లు, ఐదు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు. నిందితులను రిమాండ్ నిమిత్తం సబ్ జైలుకు పంపించామన్నారు. మరో ఆరుగురు వ్యక్తులు తప్పించుకుని పారిపోయారన్నారు.

సంగారెడ్డి భక్తుల కళా వైభవం



సత్యసాయి స్తోత్రాన్ని పఠనం చేస్తున్న భక్తులు

ప్రశాంతి నిలయం: సంగారెడ్డి జిల్లా సత్యసాయి భక్తుల కళా వైభవం పరవశింపజేసింది. పర్తి యాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన సంగారెడ్డి జిల్లా సత్యసాయి భక్తులు శనివారం ఉదయం సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత సత్యసాయి స్తోత్రాన్ని పఠించారు. సాయంత్రం సత్యసాయి యూత్, బాలవికాస్ విద్యార్థులు 'బాలకాండలో సంస్కరణల పర్వం' పేరుతో సంగీత నృత్యరూపకం నిర్వహించారు. సత్యసాయి బాల్యదశ, ఆయన సేవా స్ఫూర్తి, ప్రేమ తత్వాన్ని వివరిస్తూ సాగిన సంగీత నృత్యరూపకం ఆకట్టుకుంది.

పరిమళించిన మానవత్వం

- ఫుట్‌పాత్‌పై వృద్ధుడి నరకయాతన
- ఆకలి తీర్చి.. ఆటోలో ఆస్పత్రికి చేర్చి
- ఆదర్శంగా నిలిచిన ఇంటర్ విద్యార్థినులు



వృద్ధుడిని ఆస్పత్రికి చేర్చిన విద్యార్థినులతో ఆర్ఎంఓ హేమలత, సీఎంఓ కార్తీక్‌రెడ్డి, నర్సింగ్ సూపరింటెండెంట్ నిర్మలాదేవి

అనంతపురం సిటీ: ఓ వైపు అనారోగ్యం.. మరోవైపు ఆకలిబాధ తట్టుకోలేక ఫుట్‌పాత్‌పై వృద్ధుడు ఆర్తనాదాలు చేస్తున్నాడు. ఆ మార్గంలో ఎంతోమంది వెళ్తున్నా ఎవ్వరూ పట్టించుకోలేదు. కానీ నలుగురు విద్యార్థినులు స్పందించారు. దగ్గరకు వెళ్లి ఆయన బాధ కనుక్కొని అన్నం పెట్టి.. ఆపై ఆస్పత్రిలో చేర్పి మానవత్వం చాటుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. శ్రీసత్యసాయి జిల్లా బుక్కపట్నం మండలం పాముదుర్తికి చెందిన సత్యనారాయణ (70) షుగర్, దీర్ఘకాలిక వ్యాధులతో బాధ పడుతున్నాడు. కుటుంబ సభ్యుల నిరాదరణకు గురైన ఆయన అనంతపురం చేరాడు. జిల్లాపరిషత్ కార్యాలయం ఎదుట ఫుట్‌పాత్‌పై పడి ఉన్నాడు. నాలుగు రోజులుగా అన్న పానీయాలు లేక నీరసించిపోయాడు. శనివారం ఆకలికి తాళలేక గట్టిగా కేకలు వేస్తున్నాడు. అటుగా రాకపోకలు సాగిస్తున్న వారు చూస్తూ పోతున్నారే కానీ ఎవ్వరూ ఆయన బాధ ఏమిటో కనుక్కోలేకపోయారు. అదే సమయంలో కేఎస్ఆర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ ఫస్టియర్ చదువుతున్న త్రివేణి, కళ్యాణి, శిరీష, లల్లీశ్రీ ఆ వృద్ధుడి దీనస్థితి చూసి చలించిపోయారు. అయ్యో పాపం.. అంటూ దగ్గరకు వెళ్లగానే దుర్వాసన వచ్చింది. కాలు కుళ్లిపోయి.. పురుగులు పట్టి కదలలేని స్థితిలో ఉన్న అతడిని 'ఏమైంది తాతా' అంటూ ఆరా తీశారు. అతను కడుపు పట్టుకుని ఆకలి అవుతున్నట్లు తెలిపాడు. ఆ విద్యార్థినులు తమ వద్ద ఉన్న చిల్లర డబ్బు పోగు చేసుకుని హోటల్‌నుంచి భోజనం తీసుకొచ్చి తినిపించారు. ఆ తర్వాత ఆటోను పిలిచి వృద్ధుడిని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. సంతకాలు పెడితేనే అడ్మిషన్ చేసుకుంటామని చెప్పడంతో విద్యార్థినులు నేరుగా ఆర్ఎంఓ డాక్టర్ గుజ్జల హేమలతను కలిసి విషయం తెలిపారు. ఆమె ఆలస్యం చేయకుండా విద్యార్థినులకు ధైర్యం చెప్పి.. క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్ (సీఎంఓ) డాక్టర్ కార్తీక్‌రెడ్డి, గ్రేడ్–2 నర్సింగ్ సూపరింటెండెంట్ నిర్మలాదేవిని వెంటబెట్టుకొని క్యాజువాలిటీకి చేరుకున్నారు. దుర్వాసన వస్తున్న వృద్ధుడికి సిబ్బంది చేత స్నానం చేయించిన తర్వాత అన్ని రకాల పరీక్షలు చేయించారు. కుళ్లిపోయిన కాలును తొలగించాలని, లేకుంటే ప్రాణానికే ప్రమాదమని వైద్యులు తేల్చారు. అడ్మిషన్‌లో ఉంచి చికిత్స చేస్తున్నారు. మానవత్వంతో స్పందించిన విద్యార్థినులు త్రివేణి, కళ్యాణి, శిరీష, లల్లీశ్రీని ఆర్ఎంఓ, సీఎంఓ ప్రశంసించారు. విద్యార్థి లోకానికే ఆదర్శంగా నిలిచారని కొనియాడారు.